# కన్నె గులాబీలు

కమ్ముకుని వికసించిన గులాబీపూలు, ఎవరన్నా కోసుకుంటారేమోనని, ఎత్తుగాఉన్న గోడమీదుగా కొమ్మ లెవరికీ అందవు. యౌవ్వనపు ముమ్మరంతో చూసినవారిని సొమ్మసిల్లచేసే ఆ కొమ్మకూడా ఎంద రెన్నివిధముల ఉవ్విళ్ళూరినా ఎవరికీ అందదు.

వెన్నెలరాత్రుల్లో చంద్రశాలా సవిధ సీమను తరంగితమయే గీతికారసవాహినికోసం చాలామంది కాచుకునీ ఉంటారు. హాయిగా పాట విని, ఆ నవమోహిని పొరబాటుననైనా కనబడుతుందేమోనని ఎత్తినతలలు వంచకుండా చూసిచూసి, భగ్నహృదయాలతో తిరిగిపోతూంటారు. కాని, ఆ అమ్మాయితో స్నేహం...దర్శనం...

* * * *

సుందరం మదరాసు ఎందుకు వచ్చాడో అతనికే తెలియదు. బయలుదేరినది అసలు ఎక్కడికో తెలియదు. కాని, చల్లగాలికి బీచివద్దకు చేరుకున్నతర్వాతనైనా రేడియో అవలంబనాన బొంగురుగొంతుతో అరవపాటవినబడేదాకా, తాను చివరకు అక్కడ తేలాననే విమర్శనే లేదు. చిత్రశోభలులేని సామాన్య సాంసారికజీవనం అతనికి నచ్చలేదు. కాంచనసమృద్ధి కలిగిన, కాంతాసమ్మతత్వము కలలోనైనా

అనుభవించని యోగంచేత అర్థంచేసుకోలేని ఆవేదనతో సంతోషం తెప్పించుకోవాలని...దాన్ని వెదుక్కుంటూ, దోవతెలియకుండా తిరుగుతున్నాడు.

పట్నంగూడా పాతబడిపోయింది నాలుగురోజుల్లోనే అతనికి. ఏమీ తోచదు. కాలంగడపడానికి మార్గాలు కని పించడంలేదు. స్నేహితులమాట ఎత్తటంతోనే ఎక్కడలేని విసుపూ వచ్చేది. ఏదైనా రచించడానికి యత్నంచేసినా... మరల చదువుకునేటప్పటికి రసవిహీనంగా, జీవకళ కొరవడి నట్టుగా తోచి, నిస్పృహతో వ్రాసినవాటిని చించివేసే వాడు.

తోటివారందరూ ఎందుకు...ఎలా, సంతోషంగా ఉండగలరో ఆతనికి అర్థమయ్యేదికాదు. తనకు ఏమికావలెనో దేనిని అన్వేషించుచున్నాడో తెలియదు. ఎరుగున్నవాళ్ళు ఈ విపరీతపు ఆవేదనను ప్రవర్తనను చూసి, కవికి అలవడే లక్షణాలలో అది ఒకటని, లక్ష్యపెట్టకుండా ఊరుకునేవారు. క్రమంగా ఎవరిసహచర్యాన్ని యిచ్ఛగింపకుండా ఒంటరిగా షికారు బయలుదేరటం మొదలుపెట్టాడు; కాని ఏమీ లాభం కనిపించటంలేదు. పార్థసారథిదర్శనంకోసం శుక్ర వారంనాడు తయారయ్యే తమిళాంగనా పద్మవ్యూహాన్ని బలవంతాన ఛేదించుకుంటూ వెళ్ళే అవసరాల్లోనైనా అల్లుకుపోయిన అంత అందముకూడా, అతనిని లాలసుని చేసేదికాదు. వాల్చూపులూ, చిరునగవులూ లక్ష్యపెట్టడం అలవాటైందికాదు.

* * * *

మంచుతెరలు ఇంకా కమ్ముకునిఉండటంచేత ఎండ బాగా పురివిప్పలేదు.

సుందరం మైలాపూరులో ఆ - వీధినే నడచివెళుతున్నాడు. అక్కడికి...ఆ మేడప్రాంతాలకి వచ్చేటప్పటికి కొంచెం నెమ్మదిగా అడుగువేశాడు,- సమీపించి, ఆ చక్కదనాన్ని చూస్తూ సాఫుగా ఆగిపోయినాడు.

కనపడ్డవి హిమానీ సంస్పర్శచేత రసార్ద్రములైన గులాబీపూలు:

అవి పలుకరించినట్లుగా అయింది ఆతనికి. ప్రహారీ వద్దకు వెళ్ళాడు, బరువుగాఉండడంచేత కొమ్మలు అందుబాటులోనే ఉన్నవి. పూలని - చూసి సంతోషిస్తూ నిలబడినాడు.

పూలదొంతరల మీదుగా - మేడమీద - ఆ అమ్మాయి...కనబడ్డది.

ఆ దృష్టితోనే ఆ పిల్లవంక చూసి, అక్కడ నిలువకుండా నడచిపోయినాడు.

మరునాడు ... ఆవేళకే ... అక్కడికి వచ్చి, గులాబీల చిరునగవును గమనించాడు. ఊరుకోలేక, వాటిని కోమలంగా స్పృశించి, పరవశుడైనాడు. ఆ అమ్మాయి అందుబాటుగానే కనబడ్డది. కాని, చేయి చెప్పినమాట వినలేదు ...ముందుకు సాగలేదు.

నవోదయముతో కోరికలు విజృంభించినవి. తనవి— తనకోసమే వికసించినవి - తనకు కావాలి అనుకున్నాడు;

పూసిన పూలన్నీ...మొగ్గలనుమాత్రము కనికరించి విడిచాడు.

కనబడకుండానే ఆ అమ్మాయి తోటలోనుంచి తీయనిగొంతుతో "ఎవరు అలా కొమ్మలు లాగేది?" అని కసిరినట్టుగా అడిగింది.

అతడు ఆనవాలుపట్టి పులకితుడైనాడు. జవాబు ఏమీ చెప్పకముందే...ఏమిచెప్పాలో తెలియకముందే... ఆ అమ్మాయి కనిపించింది. గ్రీన్‌హౌస్ తిన్నెమీద నిలుచుని ఉన్నది. మొగం మాత్రము అగుపడుతూన్నది.

"ఎవరు...నీ...మీరు?"

సుందరం కొంచెం తటపటాయించి, "నే...ను" అన్నాడు.

ఆ అమ్మాయి, చిరునగవుతో చూసి...చూస్తూ ఊరుకున్నది...

"పూలు...కోసుకోవచ్చునా?" అని ఆతడు సిగ్గు పడుతూ ప్రశ్నించాడు.

నవ్వుతూ...ఆతనివంక చూస్తూనే "మొగ్గలు... కూడా కావలిసుంటే..." అని తనలోతాను నవ్వుకున్నది ఆమె.

సుందరం అమాయకంగా నవ్వుతూ గోడమీదికి... ఎగువకు...చేజాపి

"ఇవి...మీరు...తీసుకోండి" - అని కోసినపూలను అందీయబోయినాడు.

ఆమె వద్దని సైగతో బదులుచెప్పింది. చిన్నబోయి

తరువాత కథ ఎలా నడపాలో తెలియక చూస్తూ నిలువబడి పోయినాడు. ఏమీ మాటాడలేదు ఆ అమ్మాయి. రోషంతో అభిమానంతో వెనుదిరిగి నాలుగు అడుగులు వేసి...ఇక మనస్సు పట్టలేక మళ్ళా అక్కడికే తిరిగివచ్చాడు.

ఇంకా అలాగే నిలువబడివున్నది. ఆతనిరాక చూసి బహుళార్థసంభరితమైన అపాంగవీక్షణ కటాక్షముతో దిగి పోయింది.

"వెన్నెల వస్తేనేకాని...జాజులు...వికసించవు..." అని ఆ అమ్మాయి పలుకులే విస్పష్టంగా వినపడ్డాయి.

* * * *

ఆ రోజంతా ఏలా గడిచిపోయిందో సుందరానికే తెలియదు. చంద్రుడికన్న తాను ముందుగా బయలుదేర డానికి పంతముపట్టినట్లు సహనమనేమాటే లేకపోయింది. కాని, మామరాకతో కాని మనసులోని కోరికలు తీర్చేందుకు మాకుమారుడుకూడా ఆయత్తుడు కాడు గాదూ?

ఎవరినీ లక్ష్యంసేయనట్లు యకాయకిని రాచబాటను నిర్భయముగా తోటలో ప్రవేశించాడు సుందరం. ఎవరినీ కన్మొరగి గానవసరములేని వైఖరిలో ఆమె సమీపించింది.

ఎవరు ముందు కౌగలించుకున్నారో, ఎంతసేపలా ఉండిపోయినారో...ఎవరికీ తెలియదు. కాని ఆ అనుభవా నందముద్రలో రేకలుగా విడిపోతూ, గులాబీలన్నీ సన్న జాజుల సైదోడున అవాఙ్మధురధోరణిలో అబ్బ! అనినట్ల యింది. విడని కౌగిలిని, విడువజాలని హృదయంతో, విడి

పించుకుంటూ, ఆ అమ్మాయికూడా "అబ్బ" అన్నది. అంత చక్కగా అనగలిగిన పెదవులను అతడు సత్కరించాడు.

"నేను...నీతో...మాటాడను" అన్నది ఆ అమ్మాయి.

సుందరం మరీ దగ్గరగా కదలి "పోనీలే..." అన్నాడు. చిన్నపిల్లల మారాంలాగా - "నా...పూలన్నీ..." అని ఆ భంగిమం నిలుపలేక నవ్వేసింది.

"మరి...ఎందుకు మాటాడావు?"

ఇద్దరూ ఒకరినిచూసి ఒకరు...ఒకమారే కలసి నవ్వుకున్నారు.

తమ చెలిమి నభిలషించలేదని కలువరిస్తూన్న జాజులతో తన నెచ్చెలివేణిని అలంకరించాడు. ఎంతో వెదికి మారుమూలల ఆకులమాటున అణగిమణగి సిగ్గుపడుతూన్న ఒకటిరెండు అరవిచ్చిన గులాబీలజన్మకూడా సార్థకంచేశాడు.

కాని, ఆ ప్రణయ సమ్మోహనంలో ఎంతకాలము అవి రేకలువిడకుండా నిలువగలవని చందమామ సర్వజ్ఞుడులాగా నవ్వుతూన్నాడు.

*        *        *        *

వెన్నెల పక్షపాతంవహించిన దోషాన సన్నగిలిపోయే రోజులు వచ్చినవి. మంచుచమకులతో ముత్తైపుతళుకు మాసిపోయిన తరువాత విరికన్నెలకుకూడా తొలిప్రాయము విరిసిపోయినది. గులాబీలకు మొదటి పరువము లేదు.

సుందరంరచనల్లో నవచైతన్యధుని పరవళ్ళుకొడుతూన్నది. కావ్యాత్మ ఆతని ఆలోచనలన్నీ సొంతంచేసుకుని మనసుజోలికి మరి వేనినీ రానీయడంలేదు.

మరచిపోలేదు...లేదు; కాని మళ్ళా, ఆ అమ్మాయి కోసం కలువరించే అలసత్వం దరిజేరడంలేదు. ఆ సంతోష మంతా సంతోషముగానే ఆగిపోయింది...

ఆమెగీతికాలాపాల్లో మును మొలవని రసాంకురములు తలచూపుతున్నవి; కాని ఆతనిచెలిమికి నిలుకడ తీసుకుని వచ్చే కవళికలు లేవు. తళుక్కుమని మెరసి నిలువకుండా మాయమయే చిన్నెలు లేవు. అందరికీ ఆప్యాయంగా కన బడుతుంది; కాని ఆశలూరించదు.

ఒకరినొకరు విడువమనుకుంటూనే విడజాలకుండానే-విడిపోయినారు.

*   *   *   *

గులాబీలు వృంతాల్ని పీడకుండానే వయస్సు కొన సాగించుకుని విడివిడిగా రేకలుగా రాలిపడుతూ జీవనసం ధ్యను సమాచీనముగా చేసుకుంటున్న అనుభవజ్ఞులలో అప్పు డప్పుడు తాత్కాలిక విభ్రమాన్ని ప్రవర్తిలజేస్తూంటాయి. అవికూడా ఎప్పటిలాగానే అందవు...అందుకోనీయవు— ఆలా ఉండిపోవాలిసిందే.

—o—